క్లుప్తంగా

‘ఓక్రిడ్జ్’ స్కూల్‌లో వరల్డ్ మ్యూజిక్ డే



గీతాలు ఆలపిస్తున్న విద్యార్థులు

రాయదుర్గం: ఖాజాగూడలోని ఓక్రిడ్జ్ పాఠశాలలో బుధవారం మ్యూజిక్ డేను నిర్వహించారు. పాఠశాలలోని సీబీఎస్‌ఈ గ్రేడ్–7 నుంచి 10 వరకు చదివే విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని సీబీఎస్‌ఈ హెడ్ రుక్మిణి, మ్యూజిక్ విభాగం ప్రతినిధులు వీరేంద్ర జాషువా, గజేంద్ర, సుధాకర్ యడవల్లి, డేవిడ్ అప్పారావులు అంతర్జాతీయ సంగీత దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు.

అందరికీ నెగెటివ్

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం 28 మందికి కొవిడ్ ర్యాపిడ్ టెస్టులు చేశారు. అందులో అందరికీ నెగెటివ్ వచ్చిందని నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. ఆర్టీపీసీఆర్ టెస్టులు 25 మందికి చేశారు.

గణేష్ ఆలయంలో ఎమ్మెల్యే, కలెక్టర్ పూజలు



పటాన్‌చెరు: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం రుద్రారం గణేష్ దేవాలయాన్ని కలెక్టర్ శరత్, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, జెడ్పీ చైర్మన్ మంజుశ్రీ జయపాల్ రెడ్డి, సర్పంచ్ సుధీర్‌రెడ్డి తదితర ప్రముఖులు సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మొక్క నాటారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధికి కేసీఆర్ ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తోందన్నారు.

రూ.4.5కోట్ల అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ మల్లేపల్లి లలిత సోమిరెడ్డి అధ్యక్షతన బుధవారం మున్సిపల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.4.5కోట్ల అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు చేయగా సమావేశంలో వాటిని ఆమోదించారు. కౌన్సిలర్ భరత్ మాట్లాడుతూ కొల్లూరులో ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపులో స్థానికులకు 25శాతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అందుకు సమావేశంలో తీర్మానం చేయాలని కోరారు. దానికి మున్సిపల్ చైర్‌పర్సన్ లలితసోమిరెడ్డి నిరాకరించారు. ఈవిషయంలో ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వినతిపత్రం ఇస్తామని ఆమె తెలిపారు. తీర్మానం చేయకపోవడంతో కౌన్సిలర్‌లు భరత్, మంజుల, సరిత, పావని, మయూరి, శంషాబాద్ రాజులు సమావేశం నుంచి వాకౌట్ చేశారు.

మెట్రో పొడిగింపుపైనే ఆశ

- 2019 ఎన్నికల తర్వాత నేడు పటాన్‌చెరుకు సీఎం కేసీఆర్ రాక
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి హరీశ్‌రావు



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: పటాన్‌చెరులో ఏర్పాటు చేయనున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు గురువారం ముఖ్యమంత్రి కేసీఆర్ వస్తున్నారు. ఆయన పర్యటనపై ఈ ప్రాంతవాసులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. 2019 ఎన్నికల ప్రచారంలో పటాన్‌చెరు వచ్చారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారి పటాన్‌చెరు వస్తున్నారు. మినీ ఇండియాగా బాసిల్లుతున్న పటాన్‌చెరు అభివృద్ధికి ఆయన వరాలు కురిపిస్తారనే ఆశలో ఉన్నారు. కాగా సీఎం పర్యటనకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి టి.హరీశ్‌రావు బుధవారం ఏర్పాట్లను పరిశీలించారు.

మియాపూర్ నుంచి...

మియాపూర్ వరకు ఉన్న మెట్రో రైలు ప్రాజెక్టును పటాన్‌చెరు వరకు పొడిగించాలని ఈప్రాంత వాసులు కోరుతున్నారు. సంగారెడ్డి వరకు కూడా పొడిగించాలనే డిమాండ్ ఉన్నప్పటికీ, కనీసం పటాన్‌చెరు వరకు ఇవ్వాలనే ఆశ ఉంది. మియాపూర్ నుంచి బీహెచ్‌ఈఎల్ చౌరస్తా వరకు సుమారు ఏడున్నర కిలోమీటర్ల దూరం ఉండే ఈ రూట్‌లో ట్రాఫిక్ ఎక్కువ. సాయంత్రం వేళల్లో, వారాంతంలో పటాన్‌చెరు రావాలంటే ఒక్కోసారి గంటకు మించే సమయం పడుతుంది. ఈ సమస్య పరిష్కారానికి మెట్రో విస్తరణ కోసం మెట్రో సాధన సమితి పోరాటం చేస్తోంది. ఇందుకోసం సంతకాల సేకరణ కూడా చేపట్టింది. ఈ క్రమంలో గత ఏడాది మెట్రో రెండో దశ విస్తరణ అంశం తెరపైకి వచ్చింది. దీంతో జిల్లా వాసులకు మెట్రో ఆశలు చిగురించాయి. ఇప్పుడు సీఎం జిల్లా పర్యటన సందర్భంగా రెండోదశ మెట్రో విస్తరణపై ప్రకటన చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. సీఎం పటాన్‌చెరుకు పాలిటెక్నిక్ కళాశాలను మంజూరు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

సీఎం సభకు ఏర్పాట్లు పూర్తి

పటాన్‌చెరు టౌన్: సీఎం కేసీఆర్ పటాన్‌చెరు పర్యటనకు సర్వం సిద్ధం చేశారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. వాహనదారులు సర్వీస్ రోడ్ మీదుగా వెళ్లాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. సీఎం పర్యటన నేపథ్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు రోడ్ల కిరువైపులా, డివైడర్లను భారీ ఫ్లెక్సీలు, హోర్డింగ్, పార్టీ జెండాలతో అలంకరించారు. వంద మంది కూర్చునేలా భారీ వేదికను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, కలెక్టర్ డాక్టర్ శరత్, ఎస్పీ రమణ కుమార్, డీఎస్పీ భీంరెడ్డి, పటాన్‌చెరు సీఐ వేణు గోపాల్ రెడ్డి, అమీన్‌పూర్ సీఐ శ్రీనివాసులు రెడ్డి, ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి, క్రైం సీఐ లాలు నాయక్, జిన్నారం సీఐ వేణు కుమార్, బొల్లారం సీఐ సురేందర్ రెడ్డి, ఎస్‌ఐలతో కలిసి పనులను పర్యవేక్షిస్తున్నారు.

1500 మందితో బందోబస్తు

సీఎం బహిరంగసభకు భారీ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఎస్పీ రమణ కుమార్‌తో పాటు నలుగురు అదనపు ఎస్పీలు, పది మంది డీఎస్పీలు, 48 మంది సీఐలు, 105 మంది ఎస్‌ఐలు, 1200 మంది ఏఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, వంద మంది హోంగార్డులు స్పెషల్ పార్టీ పోలీసులు విధులు నిర్వహించనున్నారు.



సీఎం బహిరంగ సభకు సిద్ధమైన వేదిక

సీఎం పర్యటన ఇలా..

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: సీఎం కేసీఆర్ గురువారం ఉదయం 10 గంటలకు బేగంపేటలోని ప్రగతిభవన్ నుంచి రోడ్డు మార్గం గుండా 10.30 గంటలకు రామచంద్రాపురం మండలం కొల్లూరు చేరుకుంటారు. అక్కడ డబుల్‌బెడ్‌రూం ఇళ్లను ప్రారంభిస్తారు. 11.10 గంటలకు కొల్లూరు నుంచి కొండగల్ వెళతారు. అక్కడ రైల్వేకోచ్ ఫ్యాక్టరీ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం అక్కడి ఉద్యోగులతో మాట్లాడతారు. 12.30 గంటలకు పటాన్‌చెరు చేరుకుంటారు. అక్కడ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అనంతరం బహిరంగసభలో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. బహిరంగ సభ అనంతరం తిరిగి హైదరాబాద్ వెళతారు.

బహిరంగ సభను విజయవంతం చేయండి

పటాన్‌చెరు టౌన్: సీఎం కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్ అన్నారు. బుధవారం పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామంలో బీఆర్‌ఎస్, ఎన్ఎంఆర్ యువసేన నాయకులతో కలసి సమావేశం నిర్వహించారు. ముందుగా ప్రొ.జయశంకర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు .బహిరంగ సభకు పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామంలోని మల్లన్న దేవాలయం నుంచి గురువారం ఉదయం బీఆర్‌ఎస్, ఎన్ఎంఆర్ నాయకులు, కార్యకర్తలు పాదయాత్రగా పటాన్‌చెరుకు చేరుకోనున్నట్లు చెప్పారు. రెండు పడక గదుల ఇళ్లు, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ప్రారంభం, 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటుతో ఈ ప్రాంత రూపురేఖలు మారనున్నాయన్నారు.

స్కూల్ బ్యాగ్‌ల పంపిణీ

గచ్చిబౌలి: ప్రతిభ చాటిన విద్యార్థులకు ఉద్యోగం వచ్చే వరకు రఘునాథ్ ఫౌండేషన్ చేయూత ఇస్తుందని బీజేవైఎం రాష్ట్ర కోశాధికారి, రఘునాథ్‌యాదవ్ ఫౌండేషన్ చైర్మన్ రఘునాథ్‌యాదవ్ స్పష్టం చేశారు.కొండాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతిలో ప్రతిభ చాటి 5మంది విద్యార్థుల ఉన్నత విద్యకు సహకారం అందిస్తామన్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు అనంతరెడ్డిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో స్థానికులు రాములుగౌడ్, డాక్టర్ యూసుఫ్, వెంకటేష్, కమిటీ సభ్యులు శ్రీకాంత్‌నాయక్, గోపి ముదిరాజ్, బంటీ యాదవ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న రఘునాథ్‌యాదవ్ తదితరులు

వర్షం.. ఉపశమనం

గచ్చిబౌలి: వర్షంతో వాతావరణం చల్లబడింది. వేడిమి నుంచి కొంత ఉపశమనం లభించింది. బుధవారం సాయంత్రం వర్షం కురవడంతో ప్రజలు సంతోషపడ్డారు. ఇక వర్షాకాలం ఆరంభమైందని ఆనందం వ్యక్తం చేశారు.

ఘనంగా ఆధ్యాత్మిక వేడుకలు



పూజలో పాల్గొన్న ప్రభుత్వ విప్ గాంధీ తదితరులు

శేరిలింగంపల్లి: దశాబ్ది వేడుకల్లో భాగంగా ఆధ్యాత్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం శేరిలింగంపల్లి తారానగర్‌లోని శ్రీ తుల్జాభవాని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజలో ప్రభుత్వ విప్ ఆరికెపూడి గాంధీ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మల్లికార్జునశర్మ, బీఆర్‌ఎస్ నాయకులు రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, కృష్ణయాదవ్, గోవిందచారి, గోపీకృష్ణ, కవిత, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

మనూ కొత్త కార్యవర్గం

రాయదుర్గం: ఉర్దూ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (మనూటా)కు కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్ సమక్షంలో వారు బాధ్యతలు చేపట్టారు. కమిటీ అధ్యక్షురాలుగా డాక్టర్ షబానాకేసర్, ఉపాధ్యక్షుడుగా డాక్టర్ సలావుద్దీన్ సయ్యద్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ జమీల్ అహ్మద్, సంయుక్త కార్యదర్శి(ఆర్గనైజింగ్) గా డాక్టర్ మజీద్ అలీ చౌదరి, సంయుక్త కార్యదర్శి (పబ్లిసిటీ)గా అహ్మద్ తల్హాసిద్దిఖీ, కోశాధికారిగా చావ్లా ముత్యాలరావు బాధ్యతలు చేపట్టారు. వీసీ సయ్యద్ ఐనుల్ హసన్ మాట్లాడుతూ టీచింగ్ కమ్యూనిటీ, అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు.



దుర్గంచెరువులో గుర్తు తెలియని మృతదేహం లభ్యం



మాదాపూర్: దుర్గంచెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించింది. బుధవారం మాదాపూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెరువులో మృతదేహం తేలియాడుతున్నట్టు సెక్యూరిటీ సిబ్బంది తెలపడంతో పోలీసులు సంఘటన స్థలానికి వెళ్ళి చూడగా నల్లరంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు.ఎడమ చేతిపైన స్టార్ గుర్తుతో టాటు, కుడిచేతిపైన పచ్చబొట్టు ఉందని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. వివరాలు తెలిస్తే ఫోన్ 9490617182, 8712663119 లో సంప్రదించ వచ్చు.

వరద నీటి కాలువ నిర్మాణ పనుల పరిశీలన



ఇందిరానగర్‌లో వరద నీటి కాలువ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

హఫీజ్‌పేట్ : చందానగర్ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్‌లో సుమారు రూ.4.50 కోట్లతో జరుగుతున్న వరద నీటి కాలువ నిర్మాణ పనులను బుధవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరానగర్‌లో ఎన్నో ఏళ్లనాటి సమస్య ఈ వరద నీటి కాలువ నిర్మాణంతో పరిష్కారం అవుతుందన్నారు. అభివృద్ధి పనులను అధికారులు త్వరితగతిన పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. చెత్త, మట్టిని పూడికతీత ద్వారా తొలగించి నీటి ప్రవాహం సాఫీగా సాగేలా ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఈఈ శ్రీకాంతిని, డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, నరేందర్, సందీప్, అప్సర్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

స్క్రాప్ దుకాణంలో అగ్ని ప్రమాదం

జిన్నారం(పటాన్‌చెరు): బొంతపల్లి పారిశ్రామిక వాడలోని ఓ స్క్రాప్ దుకాణంలో బుధవారం అగ్నిప్రమాదం జరిగింది. దీంతో దట్టమైన పొగ కమ్ముకొని మంటలు ఎగిసిపడ్డాయి. సమీపంలోని పరిశ్రమల సిబ్బంది సాయంతో మంటలు ఆర్పివేశారు. ప్రాణహాని జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. రసాయన డ్రమ్ములు దుకాణంలో ఉండటంతో వాటి మధ్య రాపిడి జరిగి మంటలు రేగాయని స్థానికులు చెబుతున్నారు. నిబంధనలు పాటించకుండా స్క్రాప్ దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారని స్థానికులు వాపోయారు.



హత్య కేసులో జీవితఖైదు

పటాన్‌చెరు టౌన్: ఓ మహిళ హత్య కేసులో నిందితుడికి జీవితఖైదు విధిస్తూ సంగారెడ్డి జిల్లా సెషన్స్‌కోర్టు జడ్జి తీర్పు ఇచ్చారు. పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండలం ముత్తంగి డీఎస్ కాలనీలో ఉంటున్న వెంకటరాయుడు, లక్ష్మీదేవిల మధ్య వివాహేతర సంబంధం ఉంది. కొంతకాలంగా డబ్బుల విషయంలోనూ ఇద్దరి మధ్య వివాదం నడిచింది. 2017 నవంబర్‌లో లక్ష్మీదేవి వెంకటరాయుడు ఉంటున్న ఇంటికి వెళ్లి డబ్బులు చెల్లించాలని నిలదీసింది. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో ఆమెను వెంకటరమణ హత్య చేశాడు. లక్ష్మీదేవి కొడుకు పటాన్‌చెరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అప్పటి పటాన్‌చెరు సీఐ ప్రభాకర్ దర్యాప్తులో భాగంగా నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. బుధవారం కేసు విచారణకు రాగా పీపీ శ్రీనివాస్ రెడ్డి వాదనలు విన్న సంగారెడ్డి జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి శశిధర్ రెడ్డి, నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ తీర్పునిచ్చారు. దీంతోపాటు రూ.2 వేలు జరిమానా చెల్లించాలని, లేనిపక్షంలో మరో ఆరు నెలలు జైలులో ఉండాల్సి వస్తుందని పేర్కొన్నారు.

స్థానిక పేదలకు కొల్లూరు డబుల్ ఇళ్లు కేటాయించాలి

డిప్యూటీ తహసీల్దార్ రాములుకు వినతి

పటాన్‌చెరు: ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభంకానున్న కొల్లూరు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను స్థానిక పేదలకు కేటాయించాలని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నరసింహారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను స్థానికులకే కేటాయించాలంటూ బుధవారం పట్టణ కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ రాములుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పటాన్‌చెరు నియోజక వర్గంలో 30 వేల కుటుంబాలు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నాయన్నారు. 2018 ఎన్నికల హామీలో మియాపూర్ నుంచి రుద్రారం వరకు మెట్రో రైలు పొడిగింపు, మినీ ట్యాంక్ బండ్‌లతో పాటు అనేక వాగ్దానాలు చేసినా, నేటికీ నెరవేర్చలేదన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు హబీబ్ జాని, మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, నాయకులు కుంచాల కిషన్, హమీద్, అక్రం ఉమ్మర్, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొ.జయశంకర్‌కు ఘన నివాళి



జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు



ఖాజాగూడలో .. నివాళులర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ సాయిబాబా, నాయకులు

రాయదుర్గం: తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొ. కొత్తపల్లి జయశంకర్ వర్ధంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా ఆధ్వర్యంలో జయశంకర్‌సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనకు చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు అంజమ్మ, దారుగుపల్లి నరేష్, రాజు ముదిరాజ్, అశోక్ యాదవ్, నారాయణ, గోవింద్, రమేష్‌గౌడ్, శ్రీనివాస్, సుధీర్, మాధవి పాల్గొన్నారు.

శేరిలింగంపల్లిలో..

శేరిలింగంపల్లి: ప్రొ.జయశంకర్ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ఆయన విగ్రహానికి ప్రభుత్వ విప్ గాంధీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ జయశంకర్ సేవలు మరువలేనివి అని కొనియాడారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, మల్లికార్జునశర్మ, కృష్ణయాదవ్, నటరాజ్, గోవిందాచారి, గోపీకృష్ణ, కవిత, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

పటాన్‌చెరులో..

పటాన్‌చెరు: తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి న్నారు. బుధవారం జయశంకర్ వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో ఉన్న ఆయన కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, జెడ్పీటీసీ సుప్రజ, ఎంపీపీ సుష్మ, డీఆర్‌డీఓ పీడీ శ్రీనివాసు పాల్గొన్నారు.

రామచంద్రాపురంలో....

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : రామచంద్రాపురం , భారతీనగర్ డివిజన్, తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని నిర్వహించారు. రామచంద్రాపురం పట్టణంలోని మల్లిఖార్జున నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్పనగేష్ పాల్గొన్నారు. భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజీ కాలనీలో వార్డు కార్యాలయంలో జయశంకర్ వర్ధంతి నిర్వహించగా, ఆయన చిత్రపటానికి కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు.



జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

యోగా దినోత్సవం



మాదాపూర్‌లోని మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో..



కొండాపూర్ 8వ బెటాలియన్‌లో యోగా చేస్తున్న పోలీసు సిబ్బంది

శేరిలింగంపల్లి జోన్ బృందం: శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని యూనివర్సిటీలు, కళాశాలలు, స్కూళ్లు, గేటెడ్ కమ్యూనిటీలు, ఇతర ప్రాంతాలలో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు.

- కేంద్ర ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో హెచ్‌సీయూ యోగా సెంటర్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్స్ వెల్ఫేర్ విభాగం డీన్ ప్రొఫెసర్ జి.నాగరాజు సర్టిఫికెట్లు, బహుమతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భరతనాట్య ప్రదర్శన, యోగా సాధన చేశారు. ప్రొఫెసర్లు, అధ్యాపకులు, విద్యార్థులు, ఉద్యోగులు, అధికారులు పాల్గొన్నారు.
- గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్‌లో ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోజూ యోగా, మెడిటేషన్ విధిగా చేయాలన్నారు. యోగా శిక్షకులు శైలజ యోగా సాధన చేయించారు. ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీ లక్ష్మీకాంతరావు, విద్యాసాగర్, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.
- కొండాపూర్‌లోని 8వ బెటాలియన్‌లో యోగా దినోత్సవంలో అదనపు డీజీపీ స్వాతిలక్రా, కమాండెంట్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఇషా ఫౌండేషన్ పర్యవేక్షణలో నిర్వహించారు. ఒత్తిడి జయించేందుకు యోగా, మెడిటేషన్ అందరూ నిత్యం చేయాలని వారు సూచించారు.
- కొండాపూర్‌లోని శారద హైస్కూల్‌లో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ టి రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో,యోగా గురువులు రామారావు, నాగమణి ఆధ్వర్యంలో నిర్వహించారు.
- మాదాపూర్ మెడికవర్ ఆస్పత్రిలో హ్యాష్‌టాగ్ మార్కెటింగ్ వ్యవస్థాపకులు గుల్నార్‌విర్క్, యోగా శిక్షకులు హారిక గుమ్మాడి పర్యవేక్షణలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆస్పత్రి డాక్టర్లు శ్రీలత, మాతప్రసాద్ ,గంగాధర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు
- కొండాపూర్‌లోని సంస్కృతి హైస్కూల్‌లో భారత వికాస్ పరిషత్ ఉపాధ్యక్షులు బండ్ల అశోక్, ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని జరిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ఎం లక్ష్మణ్, కాలనీ ప్రతినిధి సురేందర్‌రెడ్డి, ప్రిన్సిపల్ జ్యోతిర్మయి, కాలనీవాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.
- శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లోనే కాకుండా గేటెడ్ కమ్యూనిటీలలో యోగాసాధన చేశారు.
- ఆరోగ్యానికి యోగా మంచిదని చేవెళ్ల మాజీ ఎంపీ కొండ విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం చందానగర్‌లోని పీజేఆర్ స్టేడియంలో 9వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు సందయ్య మెమోరియల్ ట్రస్ట్ సహకారంతో స్వాభిమాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు శివకుమార్, మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతరెడ్డి, రాష్ట్ర నాయకులు కసిరెడ్డి బాస్కర్‌రెడ్డి, వినోద్‌రావు, రాధాకృష్ణ యాదవ్, కర్చర్ల ఎల్లేష్, పద్మ, శివాసింగ్, జగదీష్, స్థానికులు, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



గచ్చిబౌలిలోని నాగార్జున రెసిడెన్సీలో..



పీజేఆర్ స్టేడియంలో యోగా దినోత్సవంలో మాజీ ఎంపీ విశ్వేశ్వరరెడ్డి, రవికుమార్ యాదవ్



టెలికామ్‌నగర్ పార్కులో యోగా చేస్తున్న కాలనీవాసులు



నల్లగండ్ల అపర్ణ గ్రాండేలో ..